క్లుప్తంగా

క్షేత్ర సందర్శన



అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ఇప్పల నర్సింగాపూర్ గ్రామంలో తెలంగాణ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గురువారం లోహియా ఎడిబుల్ ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కంపెనీ సీఈవో సిద్ధాంత్ లోహియా మాట్లాడుతూ.. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి సంబంధించిన భూమి జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావుపేట గ్రామంలో తీసుకున్నామని, త్వరలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. వేసవిలో మొక్కలకు సరిపడా నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ భరత్, రైతు గూడురు స్వామిరెడ్డి, కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వేణు, కాటిపల్లి సంజీవరెడ్డి, రాజిరెడ్డి, రామచంద్రం, పల్లె వీరయ్య,మల్లు, గాజా తిరుపతి,సామల కోటిరెడ్డి, గూడురి చైతన్యరెడ్డి తదితరులు ఉన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి



మాట్లాడుతున్న శంకర్

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు కొత్త ఆలోచనలతో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఇంటర్న్‌షిప్ ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు నేర్చుకున్న చదువుతో ఏదైనా చిన్న పరిశ్రమను స్థాపిస్తే కొంతమంది గ్రామీణ యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. శిక్షణ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ ద్వారా చిన్న పరిశ్రమల ఏర్పాటుకు చేయూతనందిస్తున్నాయని తెలిపారు. అనంతరం ఎంఎస్‌ఎంఈ తరఫున ది నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ పి.ముత్తుకుమారన్ శిక్షణ ఇస్తూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల సైన్స్ సెల్ కో ఆర్డినేటర్, డీన్ డాక్టర్ ఎం.వి సతీశ్‌కుమార్, సమన్వయకర్త డీన్ డాక్టర్ యోగేశ్ కుండలిక్, అధ్యాపకులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి అండగా స్నేహితులు

సైదాపూర్: చిన్ననాటి మిత్రుడి ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందగా తోటి స్నేహితులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. వెన్కెపల్లి ఉన్నత పాఠశాల 2005–06 పదోతరగతి విద్యార్థులు రూ.65 వేలు జమచేసి మృతుడు మ్యాకల మహేందర్ కూతురు పేరుమీద పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. గురువారం మృతుడి కుటుంబానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందజేశారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్ గురువారం ప్రారంభించారు. నాణ్యతతో పనులు త్వరగా పూర్తిచేయాలని శ్రీనివాస్ కోరారు. ఈకార్యక్రమంలో బసవయ్య, రాజయ్య, ఓదెలు తదితరులున్నారు.

పంచాయతీ రాజ్ ఏఈ రాంబాబుకు షోకాజ్ నోటీస్

ఇల్లందకుంట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని ఇల్లందకుంట, భోగంపాడు, వంతడ్పుల గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. అంతర్గతరోడ్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పంచాయతీరాజ్ ఏఈ రాంబాబుకు కలెక్టర్ పమేలా సత్పతి గురువారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఈనెల 31 లోపు రోడ్ల నిర్మాణంపై వివర ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వొడితెల ప్రణవ్

జమ్మికుంట: మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంపత్, కుమార్, కిరణ్, మురళి, నివాంత్, రాజు, వాసు, రాజేందర్, బాబు ఉన్నారు.

చదువులమ్మకు బిడ్డల చేయూత

- ప్రభుత్వ పాఠశాలల్లో పలు అభివృద్ధి పనులకు పూర్వ విద్యార్థుల శ్రీకారం
- విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్న వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



వెదిర జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు నిర్మించిన స్టేజీ

రామడుగు: విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలకు చేయూత అందించి రుణం తీర్చుకోవాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించుకున్నారు. అనుకున్న వెంటనే పాఠశాలల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టి ఔదార్యం చాటుకుంటున్నారు. వెదిర పాఠశాలలో ఏళ్ల క్రితం పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతుండటంతోపాటు విద్య నేర్పిన గురువులను సన్మానిస్తూ గురుభక్తిని చాటుకుంటున్నారు. మండలంలో వెదిర, వెలిచాల, దేశరాజ్‌పల్లి, రామడుగు, రుద్రారం, గోపాల్‌రావుపేట, గుండి గ్రామాల్లో జిల్లా పరిషత్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమకు తోచిన విధంగా సహకారం అందిస్తున్నారు. వెదిర జిల్లా పరిషత్ పాఠశాల 1983–84 పదో తరగతి విద్యార్థులు నాలుగేళ్ల క్రితం రూ.లక్షా యాభై వేలు పోగు చేసి స్కూల్ ఆవరణలో స్టేజీ నిర్మించారు. అలాగే ఇదే పాఠశాలలో చదువుకున్న చెన్నమనేని రాజేందర్‌రావు కూతురు చెన్నమనేని రిషితరావు బోర్‌మోటారు సమకూర్చారు. ఎల్‌ఐసీ ధర్మపురిశాఖ మేనేజర్‌గా పని చేస్తున్న పూర్వ విద్యార్థి భీరెడ్డి ప్రేమ్‌సాగర్‌రెడ్డి విద్యార్థుల కోసం ఎల్‌ఐసీ ద్వారా ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. రామడుగు పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు శ్రీసంరస్వతి మాత విగ్రహం ప్రతిష్ఠించారు. అలాగే ఇదే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు పలువురు క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేస్తున్నారు. గోపాల్‌రావుపేట పాఠశాలలో పూర్వ విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్నారు. వెలిచాల పూర్వ విద్యార్థులు సైతం క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలల్లో చదువుకొని ఎక్కడెక్కడో స్థిరపడిన వారు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి వివిధ పనులు, కార్యక్రమాలు చేపడుతుండటంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పూర్వ విద్యార్థులు అందరూ ఇలా ముందుకు వస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్నిరకాల వసతులు సమకూరుతాయని, విద్యార్థుల సంఖ్యపెరగడంతోపాటు నాణ్యమైన విద్య లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

స్టేజీ నిర్మించాం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించుకున్నాం. పాఠశాలలో ఉన్న పాత స్టేజీని తీసివేసి కొత్తది నిర్మించాలనుకున్నాం. అందరం కలిసి డబ్బులు జమ చేశాము. రూ.లక్షా యాభై వేలతో స్టేజీ నిర్మించాం. పాఠశాలలో స్టేజీ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది.

– గాజుల ఆనందం, పూర్వ విద్యార్థి, వెదిర

వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వెదిర జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి వరకు చదివాను. పాఠశాలకు నావంతుగా ఏమైనా చేయాలని ఆలోచించి మా సంస్థ ప్రత్యేక అనుమతితో స్కూల్‌లో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశాం. త్వరలో పూర్వ విద్యార్థులం పాఠశాలకు ఇంకా ఏదైనా అందించాలని ఆలోచిస్తున్నాం.

– భీరెడ్డి ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ఎల్‌ఐసీ ధర్మపురిశాఖ మేనేజర్

చాలా ఉపయోగపడుతుంది



పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో నిర్మించిన స్టేజీ చాలా ఉపయోగపడుతుంది. సమావేశాలు, విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడంతో పాటు ఉదయం వాకర్స్ వ్యాయామం చేసుకోవడానికి స్టేజీ ఉపయోగపడుతోంది. పూర్వ విద్యార్థులు పాఠశాలలో అభివృద్ధి పనులు చేయడం ఆనందంగా ఉంది.

– వెన్న రాజమల్లయ్య, వెదిర గ్రామస్తుడు

పన్నుల వసూళ్లలో హుజూరాబాద్ మున్సిపాలిటీకి రెండో ర్యాంక్



పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్, అధికారులు

హుజూరాబాద్: పన్నుల వసూళ్లలో హుజూరాబాద్ మున్సిపాలిటీ రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. గురువారం పట్టణంలోని పలు ఏరియాల్లో పన్ను వసూలు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఆస్తి పన్నుల డిమాండ్ రూ.2.49 కోట్లు ఉండగా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్లతో కలిసి ఈనెల 27వ తేదీ వరకు రూ.2.29 కోట్లు వసూలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా రెండో ర్యాంకు సాధించామని తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోపు ఇంటి, నల్లా, ట్రేడ్ లైసెన్స్, షాపింగ్ గదుల కిరాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ కె. రామ్మోహన్ రాయ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.సంపత్ రావు, ఇంచార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కిషన్‌రావు, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు తదితరులు ఉన్నారు.

తాగునీటిపై సమీక్ష

సైదాపూర్: మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాష్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో తాగునీటిపై సమీక్షించారు. వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు సిబ్బందికి సూచించారు.

వైభవంగా శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం



వీణవంక: కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, నాయకులు

వీణవంక: మండలంలోని వల్భాపూర్ గ్రామంలో అభయాంజనేయస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీధరాచార్యులు, నరసింహాచార్యులు వేదమంత్రోచ్చారణలతో స్వామివారి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణం సందర్భంగా రూ.లక్ష చెక్కును అందజేశారు. మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో శ్రీరాజరాజేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మాడ వనమాల సాదవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు వాల బాలకిషన్‌రావు, ఎంపీటీసీ మూల రజితపుల్లారెడ్డి, దేవేందర్, మాజీ సర్పంచులు, ఆలయ కమిటీ చైర్మన్లు శ్రీనివాస్, రాజమౌళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

జమ్మికుంట: పట్టణంలోని మోత్కులగూడెం పరిధి హన్మాండ్లపల్లిలో బాలాంజనేయస్వామి ఆలయ 18వ వార్షికోత్సవాలను వేదపండితులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, బీఆర్‌ఎస్ జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నరసింహాస్వామి రథోత్సవం

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో నరసింహాస్వామి బ్రహ్మోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం అనంతరం సాయంత్రం గ్రామంలోని వీధుల గుండా రథోత్సవం చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయానికి రూ. 51 వేల విరాళం

చొప్పదండి: పట్టణంలోని సాయినగర్ సాయిబాబా ప్రధాన ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా చొప్పదండి చెందిన వ్యాపారి బోడిగె మోహన్‌వనిత దంపతులు గురువారం ఆలయ ట్రస్టు చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డికి రూ.51,116 అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు ప్రధాన కార్యదర్శి డోలి రాజయ్య, కోశాధికారి దండె లింగన్న, జాయింట్ సెక్రటరీ దూస రాము, ఉపాధ్యక్షులు కటకం మహేశ్, సభ్యులు తాటిపల్లి అంజయ్య, వల్లాల నగేశ్, గుర్రం ఆనందరెడ్డి పాల్గొన్నారు.



మానకొండూర్‌రూరల్: పచ్చునూర్‌లో రథోత్సవం



చొప్పదండి: విరాళం అందజేస్తున్న దాతలు

కేంద్ర బలగాలతో కవాతు



హుజూరాబాద్‌రూరల్: గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ బొల్లం రమేశ్, పోలీసు సిబ్బంది

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో గురువారం సీఐ రాజ్‌కుమార్ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా కవాతు చేపట్టి గ్రామంలోని చౌరస్తాలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఎలాంటి గొడవలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవు

హుజూరాబాద్‌రూరల్: గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని సీఐ బొల్లం రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని సిర్సపల్లి, పోతిరెడ్డిపేట గ్రామాల్లో కరీంనగర్ సీపీ ఆదేశాల మేరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ ప్రధాన కూడళ్ల వద్ద గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో అనవసర సందేశాలు పంపొద్దన్నారు. ఎలాంటి మీటింగ్‌లకైనా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. ఫ్లాగ్‌మార్చ్‌లో 40 మంది సీఐఎస్‌ఎఫ్ ఆఫీసర్స్, జవాన్లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వాహనాల తనిఖీ

జమ్మికుంట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా పట్టణంలోని మోత్కులగూడెం, కొత్తపల్లి చౌరస్తాల్లో గురువారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రంకెన్‌డ్రైవ్, ట్రిబుల్ రైడింగ్, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో పోలీసులు, జవాన్లు పాల్గొన్నారు.



పచ్చునూర్‌లో కేంద్రబలగాల కవాతు



జమ్మికుంటలో వాహనాల తనిఖీ

విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు



హుజూరాబాద్: పట్టణంలో పది తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఐఏయూ వైఎస్‌ఏ ఇంటర్నేషనల్ యునైటెడ్ యంగ్‌స్టార్ అసోసియేషన్ ఆవిర్భవ దినోత్సవం పురస్కరించుకొని గురువారం మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మాట్ల జవహర్ చటర్జీ, అజయ్, పవన్, అఖిల్, రవళి, శ్రీలత తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

హుజూరాబాద్: హుజూరాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం కోర్టు ఆవరణలో నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గొస్కుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బండి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా మట్టెల తిరుపతి, లైబ్రరీ సెక్రటరీగా అప్పని రాజు, కోశాధికారిగా ఎం దివ్య, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పులుగు లింగారెడ్డి ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు కె.భగవాన్ రెడ్డి, సీకే జేమ్స్, ఎస్.సత్యనారాయణలు తెలిపారు. సహాయ కార్యదర్శిగా పి.జ్యోత్స్న దేవి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా కల్వల సౌమిత్ర, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కె.సరిత, మహిళా సభ్యురాలిగా ముశం మౌనిక గతంలోనే ఎన్నికయ్యారు.

బార్‌అసోసియేషన్ కార్యదర్శిగా సంజీవరెడ్డి



జిల్లెల్ల సంజీవరెడ్డి

ఇల్లందకుంట: తెలంగాణ బార్ అసోసియేషన్ కార్యదర్శిగా మండలంలోని భోగంపాడుకు చెందిన జిల్లెల్ల సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. మాజీ సర్పంచ్ జిల్లెల్ల తిరుపతిరెడ్డి, జిల్లెల్ల శ్రీపాల్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ



ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న మెప్మా ఉద్యోగులు, మహిళలు

హుజూరాబాద్: పట్టణంలోని 17వ వార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఓటరు నమోదు, ఓటుహక్కు వినియోగంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాల నిండిన యువత ఏప్రిల్ 14 వరకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసీ కే.మానస, సీఎల్‌ఆర్‌పీ, కే.స్వరూప, ఆర్‌పీ చాంద్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి రాకుండా అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రామానుజాచారీ

గన్నేరువరం: వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రామానుజాచారీ సూచించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామ పంచాయతీలో గురువారం మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ బావులు, బోరువెల్‌ల నిర్వహణపై జీపీల ప్రత్యేకాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నీటి సమస్య తీవ్రతను బట్టి ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. పైపులైన్ లీకేజీ మరమ్మతులను నిర్లక్ష్యం చేయొద్దని, నిరుపయోగంగా ఉన్న బోరుబావులు, చేతి పంపులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం గునుకులకొండాపూర్‌లో చేపట్టిన పైపులైన్, మోటార్ బిగింపు, గన్నేరువరంలో ఎల్‌ఎండీ నుంచి గ్రామ వాటర్ ట్యాంకు వరకు ఉన్న పైపులైన్, చీమలకుంటపల్లెలో అద్దెబావి నుంచి నీటి సరఫరాను పరిశీలించారు. వేసవి ముగిసే వరకు నీటి సరఫరాపై గ్రామాల వారీగా సమీక్ష చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఏపీవో నర్సింహారెడ్డి, మిషన్ భగీరథ ఏఈ వీరబ్రహ్మం, ఏవో కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ప్రాధాన్యమివ్వాలి



పూల మొక్క అందిస్తున్న రేణుక శివకుమార్‌గౌడ్

జమ్మికుంట: కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను జమ్మికుంటకు చెందిన సీనియర్ నాయకుడు పూదరి రేణుకశివకుమార్‌గౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీని నమ్ముకొని, ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేసిన కార్యకర్తలను గుర్తించి, నామినేటెడ్ పదవులతో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని శివకుమార్‌గౌడ్ వివరించారు.

వెంకన్న ఆలయంలో సినిమా షూటింగ్



క్లాప్ కొడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం జయతు జయతు సినిమా షూటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ క్లాప్ కొట్టి సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రావణ్‌కుమార్, ప్రొడ్యూసర్ జమదగ్ని, నటులు రాజీ, శ్రీరమ్య, తదితరులు ఉన్నారు.